# ప్రేమను ప్రేమించు పెళ్లికై

— కట్టమంచి ప్రభావతి

ఆమె కుళ్లి కుళ్లి ఏడుస్తోంది. హాస్పిటల్‌లో తన కోసం నిరీక్షించే రోగుల గురించి కూడా ఆలోచించే స్థితిలో లేదామె. కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా ఉబ్బి పోయాయి.

ఆ క్షణంలో.... మనస్ఫూర్తిగా కన్నీరు తుడిచి, గుండెల్లో దాచుకుని, 'నీకు అండగా నేనున్నా' నని వెన్ను తట్టి ముందుకు నడిపే తోడుకావాలి. అలాంటి వ్యక్తి ఒళ్లో ఒదిగిపోయి విశ్రాంతిగా సేదదీరాలి. ఈదుఖాన్ని గతంలో కలిపెయ్యాలి.....అంతటి దగ్గరితనం అమ్మ దగ్గర తప్ప మరెక్కడ దొరుకుతుంది?

ఎవరు మిగిలారు ఓదార్చటానికి?

ఎవర్ని మిగుల్చుకో గలిగింది?

నా జీవితం—నా యిష్టం' అంటూ ముందు చూపు లేని ఎదురీతలాంటి నిర్ణయం ప్రకటించిననాడే 'నా' అనుకోగల అందర్ని దూరం చేసుకుంది. ఆ దిగులు తోనే అల్లారుముద్దుగా పెంచిన అమ్మ ఈ లోకం నుంచే శాశ్వతంగా నిష్క్రమించింది.

తండ్రి క్షయతో పక్షవాతంతో పోరాడి అలిసిపోయి 'అమ్మ' చిరునామా కోసం వెతుక్కుంటున్నాడు! వదినలకు పరమ విధేయులైన అన్నలిద్దరూ వాళ్ళకళ్ళ రిమోట్ కంట్రోల్‌తో నడిచే యంత్రాలు! వదినల దృష్టిలో ఆమె ఈ సృష్టిలోని నీచమైన అన్నిటికంటే నీచమైనది.

అయితేనేం?

"నా ప్రబంధ్ కౌగిలి నాకు ఉక్కుకవచం. నా ప్రబంధ్ సహచర్యం వందమంది బంధువుల అండదండలతో సమానం" అనుకునేదామె.

గత కొద్ది రోజులుగా ఆ కవచం బీటలు తెలుస్తున్నా ఈ రోజే దాని అసలు రంగు తెలిసింది.... ఆమె హృదయం బ్రద్దలైంది.

ఇప్పుడామె బాధ బ్రతుకు దెరువు గురించికాదు... మంచి ప్రాక్టీసున్న డాక్టరుగా ఆమెకాదిగులేనాడూ లేదు, కానీ.. అంత గాఢంగా ప్రేమించిన ప్రబంధ్... అతనిపై అంచంచల విశ్వాసంతో అయినవాళ్లందర్నీ త్యజించిన తనని ఇంతఘోరంగా వంచించటమా?

ఈ ఓటమినే ఆమె ఏమాత్రం సహించలేక పోతూంది.

నిస్సహాయత లోంచీ పొంగిన కన్నీరు కంటికాటుకలో విలీనమై 'నల్లనది' లా చెంపలపై చారికలు కట్టింది.

హాల్లో ఆడుకుంటున్న నాలుగేళ్ళపాప తల్లిని గమనిస్తూనే ఉంది. ఈ మధ్య తల్లి ఎప్పుడూ దిగులుగా ఉండటం, అప్పుడప్పుడూ కళ్లొత్తుకోవటం...'నాన్నొచ్చి వెళ్లింతరువాతే' తరచుగా అలా జరుగుతుండటం ఆ లేత మనసుని తల్లడిలజేసింది.

"ఈసారి నాన్నొచ్చినప్పుడు అమ్మని ఏడిపించొద్దని చెప్పాలి." అనుకునేది పాప. తీరా అతనొచ్చి ఎత్తుకుని ముద్దులు కురిపించేసరికి అన్నీ మర్చిపోయేది.

చిందరవందరగా పడిన బొమ్మల్ని ఓచోట చేర్చి మెల్లగా తల్లి దగ్గరకు చేరింది పాప.

"అమ్మా! ఏలవకు!" చిన్ని చేతుల్తో తల్లి చెంపలపై జారుతున్న కన్నీటిని తుడుస్తూ ఓదార్పుగా అంది పాప, బుంగమూతి పెట్టి.

"ఇక ఈ ఒంటరి బ్రతుక్కి ఈ పాపే దీపం" అనుకుందామె.... కన్నీరు తుడిచేతోడు... తన ప్రేమఫలం... జ్ఞాపకాల దొంతరల ప్రతిరూపం అన్నీ పాపే.

ఆమె మనసు రోదిస్తూనే వుంది.

నుదులు తిరుగుతూ తరుముకొస్తున్న జ్ఞాపకాల్లో మునిగింది.

షెల్ఫ్‌లో అందంగా పేర్చినట్లున్న పుస్తకాలు..... తన ప్రేమ కానుకలు.... తమ అనుబంధానికి వారధులు...తన మానసికపరిణామానికి సారధులు. తన జీవన గమనానికి సాక్షులుగా.. నవ్వుతూ పలకరిస్తున్నట్లున్నాయి.

'ఓ స్త్రీ స్వేచ్ఛా రచయితల్లారా! రచయిత్రులారా! రండి! నన్ను రక్షించండి. నన్ను ఓదార్చండి! శిథిలమైన నా జీవితానికి మీ సంజాయిషీ యివ్వండి!" ఎలుగెత్తి అరవాలను కుందామె.

నోరు పెగల్లేదు.

"ఇందులో నీ బాధ్యత లేదా?" నిలదీస్తోంది ఆమె అంతరాత్మ.

తల్లి ప్రతిమలా ఉండటంతో పాప మళ్లీ ఆటవస్తువుల దగ్గర కెళ్లింది. వాటిలో దేనికోసమో వెదుకుతోంది.

"ఏమో బాబు! నువ్వు చెప్పేదంతా అయోమయంగా వుంది. నాకేమర్ధం కావటల్లేదు" అనాసక్తిగా అంది నీరజ.

"పాఠ్య పుస్తకాలే ప్రపంచమనుకుంటే పుస్తకాల పురుగు అన్న బిరుదు పొంద గలవు; కానీ, ఇలాంటి నిత్యసత్యమైన వాస్తవాలు ఎప్పటికీ అర్ధం చేసుకోలేవు."

"మొన్న ఇచ్చిన "శశిరేఖ" పూర్తయిందా?" అడిగాడు ప్రబంధ్.

"ఏకబిగిన చదివేశాను అద్భుతంగా వుంది."

"ఏ కోణంలో?"

"ప్రేమకీ, పెళ్ళికీ మధ్య ఉన్న శత్రు వైరుధ్యాన్ని పోస్ట్ మార్టం చేశారు రచయిత. ఇన్నేళ్లనించీ ఈ రచనలు చదువుతూ కూడా ఇంకా ఈ మనుషులు పెళ్లిళ్లు చేసుకుంటున్నారంటే నాకు మరీ ఆశ్చర్యంగా వుంది. 'శశిరేఖ' జీవిత గమనంలోని మలుపులు గమనంలోని మలుపులు గమనిస్తే ఏదీ శాశ్వతం కాదనిపిస్తోంది. ప్రేమకూడా అశాశ్వతమేనా?" దిగులుగా ప్రశ్నించింది నీరజ.

"అక్కడే పొరబడ్డావ్ నీరూ! అశాశ్వతమైంది ప్రేమ కాదు. ప్రేమకు మరణంలేదు, చిరంజీవి. ప్రేమింపబడే వస్తువులే అశాశ్వతం!"

"అంటే?"

"మనం స్వీట్ స్టాల్ కెళతాం. రోజూ ఒకేస్వీట్ తినగలమా? క్లాసులో రోజూ ఒకేపాఠం లెక్చరిస్తే బోర్ కొట్టదూ? అంతెందుకు! మెస్‌లో వరుసగా రెండు పూటలు వంకాయ కూర చేశారని విద్యార్ధులు సమ్మె చెయ్య లేదూ?"

"ప్రేమా, వంకాయకూరా ఒకటేనా?"

"అంటే....ఇతరపుస్తకాలు కూడా చదవమంటావు. అంతేగా?"

"అవును. స్వేచ్ఛా జీవిగా సమాజంలో వికసించాలంటే విరివిగా పుస్తకాలు అధ్యయనం చెయ్యాలి. అధ్యయనం చెయ్యటం పాఠ్యపుస్తకాల 'రొటీన్' నించీ ఆటవిడుపుగా ఉపయోగించటంతోపాటు మానసిక వికాసానికి తోడ్పడతాయి."

"మెడికల్ బుక్స్‌కే టైం చాలక చస్తుంటే విరివిగా, కనపడ్డ ప్రతి పుస్తకమూ చదివే వీలెక్కడుంటుంది?"

"ప్రతిదీ చదవమని చెప్పటల్లేదు, వీలైనన్ని చదవాలంటున్నాను."

"ఏఏ పుస్తకాలు చదవాలో అదికూడా నువ్వే చెప్పు."

"చెప్పటం కాదు. నేనే కానుకలుగా యిస్తుంటాను."


వారానికొకటీ రెండు పుస్తకాలు ప్రబంధ్ యిస్తూనే వున్నాడు. పాఠ్యగ్రంధాలు మాత్రమే చదవటానికి అలవాటుపడిన నీరజ వాటిని పాఠ్యపుస్తకాలంత శ్రద్ధగానే చదవసాగింది. అప్పుడప్పుడు పుస్తకాల గురించి చర్చించుకోవటం కూడా జరుగుతుండేది. పూర్తిచేస్తున్న పుస్తకాలతో పాటు అభిమానం ప్రేమగా రూపుదిద్దు కుంటోందని నీరజ గమనించే సరికి ఆమె భావాలు చిత్రాతి చిత్రంగా పరిణతి చెందాయి. ఆరోజు గార్డెన్‌లో కూర్చునుండగా,

"ఉదాహరణకి చెప్పాన్లే! అసలు ప్రేమంటే ఏమిటీ? అదేదో గొప్ప అగోచర పదార్ధమనుకుంటున్నావా? కేవలం యిష్టానికి పర్యాయపదం ప్రేమ. కాలం కదలకుండా వుంటుందా యిష్టం నిశ్చలంగా ఉండటానికి?"

"మనం రోజూ కలుసుకుంటున్నాం. ఏదన్నా ఒక్క రోజు నిన్ను చూడకపోతే ఏదో పోగొట్టుకున్నట్లు అశాంతిగా ఫీలౌతాను. ఇదే కదా ప్రేమంటే! మనం ప్రేమించుకుంటున్నాం. కాలం ఆగిపోకపోయినా మనప్రేమ నిశ్చలంగా లేదూ?"

"కాల గమనంలో ప్రేమస్వరూపం మారుతుంది; సాంద్రత తగ్గుతుంది... ఇదే నేను చెప్పదలిచింది. మనం తాజ్‌మహల్ చూడాలని ఆరాటపడతాం! ఆ సౌందర్యం చూసి, ఆస్వాదించి పరవశించాలని తపిస్తాం! కాని, ఆగ్రాలో వుండేవాడు రోజూ ఆ తాజ్ మహల్‌ని చూసి తొలిసారి చూసినప్పటి మధురానుభూతి ప్రతి రోజూ పొందగలడా? తాజ్‌మహల్‌కి పది గజాల దూరంలోఉన్న మాకీవర్ దృష్టి ప్రపంచంలోని 'అత్యంత సుందర ప్రేమచిహ్నాం' మీద వుంటుందా? యాత్రికుల పాత చెప్పులమీద తప్ప! అందుకే ప్రేమ సాంద్రత తప్పకుండా మార్పు చెందుతుందనటం!"

"మరి పెళ్లికి అర్ధం, పరమార్ధం?" నీరజ సందేహం వ్యక్తం చేసింది.




"ఏ అర్థం లేనిదే పెళ్లి. ప్రేమని 'శూన్యం' చెయ్యటమే దాని పరమార్థం" రెండు ముక్కల్లో తేల్చేశాడు ప్రబంధ్.

"పెళ్లి అర్థంలేనిదైతే కావచ్చునేమోగానీ, ప్రేమ చంచలమంటే ఒప్పుకోను. రోటీ, కపడా, మకాన్‌ల హామీకి పరిమితమైన కలుషిత ప్రేమల మధ్య మనదీ ప్రేమే ననుకోవటమే నాకు ఇష్టం లేదు. మరో క్రొత్త పదం సృష్టించుకుందాం మన ప్రేమను పిలుచుకోటానికి! మనది ఆప్యాయత, అనురాగం, అనుబంధాల అందమైన మేళవింపు! మన ప్రేమ సాంద్రత తగ్గుతుందనే వూహే భరించలేను ప్రబంధ్" అతనికి దగ్గరై గుండెల్లో తలదాచుకుంది నీరజ.

"ప్రకృతిలో నిశ్చలమైన, చంచలమైన అనేక సత్యాల పాటు వాటికి కొన్ని మినహాయింపులూ ఉంటాయి. మన ప్రేమ అలాంటిదేమో! నిజం నీరూ, నీవు లేకుండా, నీకు దూరంగా బ్రతకలేననిపిస్తోంది" ఒక చేత్తో తల నిమురుతూ, మరో చేత్తో మరింత దగ్గరగా హత్తుకున్నాడు ప్రబంధ్.

ప్రేమ గమ్యం పెళ్లికాదన్న అభిప్రాయం నీరజలో మొలకెత్తటం ఆలస్యమైంది కానీ, ఆ భావం మహావృక్షం కావటానికి ఎక్కువ కాలం పట్టలేదు. పెళ్లి చేసుకుంటున్న ఎవర్ని చూసినా వాళ్లపట్ల చెప్పలేనంత చులకన భావం పెరగసాగింది. ఆమె దృష్టిలో వివాహ బంధానికి కట్టుబడిన వాళ్లంతా బానిసలు! వ్యక్తిత్వం లేని మనుమలు.

ప్రేమగమ్యం పెళ్లికానప్పుడు, పెళ్లి తరవాత వుండే సంసార సంబంధానికి ముహూర్తాలూ, హద్దులూ అవసరం లేదు.

ఇద్దరూ 'మెడికో' లే కనుక బంధం 'భారం కాకుండా' జాగ్రత్త పడుతున్నారు. వాళ్ల ప్రేమకు అయిదేళ్లు నిండాయి. ప్రబంధ్ యం.యస్ చేస్తున్నాడు. నీరజ హౌస్‌సర్జన్.

తండ్రి ఉత్తరం అందుకుని వూరెళ్లాడు ప్రబంధ్. మూడు లక్షల కట్నంతో, మేనమామ కూతురు సజయతో పెళ్లి నిశ్చయించేసుకుని తిరిగొచ్చాడు.

ప్రబంధ్ కోసమే వేయికళ్లతో ఎదురుచూస్తున్న నీరజ "రెండు రోజులై కనిపించలేదు. ఏమయ్యావ్? నేనెంత ఒంటరితనం ఫీలయ్యానో తెలుసా?" లాన్‌లో కూర్చుంటూ అంది.

"నా ప్రేమ తగ్గిందని భయపడ్డావా?"

"తగ్గితే అది ప్రేమకాదని ఎప్పుడో చెప్పాను, మర్చిపోయావా?"

"అయితే, మరేమిటట?" చిరునవ్వుతో అన్నాడు ప్రబంధ్.

"వ్యామోహం!"

"రెండింటికీ తేడా చాలా సున్నితమైనది."

"అసలంటూ తేడా వుందని ఒప్పుకున్నావుగా! సరే! ఎక్కడి కెళ్లావంటే ఏదో మాట్లాడతావు. ఇష్టం లేకపోతే చెప్పొద్దులే!" మూతి ముడిచింది నీరజ.

"నాన్న ఉత్తరం రాస్తే ఊరెళ్లాను. నీకోదుర్వార్త మోసుకొచ్చేందుకు!" అతనిముఖంలో గంభీరత చోటుచేసుకుంది. ముఖంలోని కండరాలు బాధ, నిస్సహాయత, గిల్టీనెస్ వంటి అనేక భావాల్ని పలికించటానికి ఎంతో శ్రమపడుతున్నాయి.

"యూసిల్లీ! నాకు దుర్వార్తా?" ఆశ్చర్యపోయింది నీరజ.

తప్పు చేసినవాడిలా తలవంచుకుని, వేళ్లతో లాన్‌ని హింసిస్తూ "నాకు మేరేజ్ సెటిలైంది" అన్నాడు ప్రబంధ్.

"కంగ్రాట్స్!" అంది నీరజ.

"నన్ను క్షమించ గలవా నీరూ?" అతని కళ్లు నీళ్లతో మెరుస్తున్నాయి.

"ఐ పిటీ యూ ప్రబంధ్!"

"నామీద కోపం, అసహ్యం కలగటల్లేదా?"

"ఎందుకు?"

"నిన్ను ప్రేమించి....." అతని మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ—

"జాలేస్తోంది పిచ్చి ప్రబంధ్! నువ్వు నన్నర్థం చేసుకుంది ఇంతేనా? ఏనాడైనా మన పెళ్లి ప్రసక్తి తెచ్చానా? నీ సహచర్యంలో చేసిన అధ్యయనం నేర్పిన జ్ఞానం మర్చిపోగలనా? ప్రభూ! ప్రేమంటే రెండు మనసులు భూమీ, ఆకాశంలా సున్నితంగా స్పృశించు కోవటం; ఆ స్పర్శలోని మృదుత్వాన్ని కర్కశంగా గుచ్చే ముల్లు పెళ్లి."

"మన ప్రేమ గమ్యం?"

"తరగని ప్రేమానుబంధం! సజయతో నీ కాపురం మన ప్రేమకు ఆటంకమా? నీకు అభ్యంతరమా?"

"అది కాదు నీరూ! నువ్వుకూడా పెళ్లి చేసుకుంటే బాగుంటుంది."

"నిన్ను చేసుకోమంటావా? నిన్నైనా పెళ్లిచేసుకోను. నా ప్రేమనీతోనే! మనప్రేమ మనకోసమే. దాన్ని లోకం కోసం పెళ్లిపేరుతో ఉరితియ్యలేను. 'ట్రాప్' అనుకున్న పెళ్లి ఉచ్చులో నువ్వెలాగూ చిక్కుకున్నావ్. మనం మాత్రం ఇప్పటిలానే ఎప్పటికీ ఉందాం." చాలా తేలికగా అనేసింది నీరజ.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు ప్రబంధ్. నీరజకి 'సాహిత్యం' ద్వారా ఇచ్చిన 'సైకోథెరపీ' విజయవంతమైందన్న గర్వం లీలగా మెదిలి అదృశ్యమైందతని కళ్లలో. ఆ మర్నాడే స్త్రీ స్వేచ్ఛని గురించి వ్రాసిన అనేక నవలలు బహుమతిగా ఇచ్చాడు నీరజకు.

* * *

కాల చక్రంలో మరో అయిదేళ్లు దొర్లాయి.

సజయ ముగ్గురు బిడ్డల తల్లి. నీరజ నాలుగేళ్ల అర్పణకు తల్లి. ప్రబంధ్ విజయవాడలో స్వంత నర్సింగ్ హోంతోనూ, నీరజ గుంటూరులో స్వంత నర్సింగ్‌హోంతోనూ ఆర్థికంగా మంచి ఉన్నతికి చేరుకున్నారు.

ప్రబంధ్ నీరజ దగ్గరకు రావటం తగ్గింది.

"ప్రేమ వల్చబడు తోందనటానికిది సంకేతం కాదు కదా!" అనుకున్న నీరజ దాన్ని వృత్తి పరమైన 'తీరిక లేక పోవటం' గా సరిపెట్టుకుంది. అయినా మనసు పొరల్లో అస్పష్టమైన వెలితి!

ఆయా సహాయంతో ఇంటి పనులు చక్కబెట్టుకుని హాస్పటల్‌కి బయలుదేరే ప్రయత్నంలో ఉంది నీరజ.

"అమ్మా! నాన్నొచ్చాలు!" కేరింతతో ప్రబంధ్ కెదురెళ్లింది అర్పణ. ఎత్తుకుని ముద్దాడి, సోఫాలో కూర్చుని ఒళ్లో పాపని కూర్చో బెట్టుకున్నాడు ప్రబంధ్.

"నాన్నా! మలేమో అమ్మ నన్ను స్కూల్లో చేల్పిస్తుందంట!" తల్లి మీద కంప్లైంట్ చేస్తున్నట్లు చెప్పింది అర్పణ.

"వెరీగుడ్! చక్కగా స్కూలు కెళ్లి బాగా చదువుకోవాలి!"

"నేను స్కూలుకి వెళ్లను."

"ఎందుకనీ?" లాలనగా అడిగాడు ప్రబంధ్.

"మలేమో సుధా నాన్నలా లోజూ నువ్వు నా దగ్గిలుందవు. ఎప్పుడో వస్తావు, వెళతావు. నేను స్కూలు కెళ్లినప్పుడు నువ్వొస్తే ఎలాచూడగలవ్?" పక్కింటి పాప సుధతో తనను పోల్చుకుని కనిపెట్టిన తేడాని తండ్రితో కళ్లు తిప్పుతూ ప్రశ్నించింది 'ర' పలకని అర్పణ.

"స్కూలు దగ్గర కొచ్చి అయినా నిన్ను చూస్తాగా! బోలెడు చాక్లెట్లూ, స్వీట్సూ కూడా తెస్తాగా!" ప్రోత్సహించాడు ప్రబంధ్.

"అయితే ఎప్పుడూ నువ్విక్కడే వుంటేనే స్కూలు కెళ్తా!"

"అప్పుడే నాన్న ఒళ్లో చేరి కబుర్లు మొదలెట్టావా?" చిరునవ్వుతో భర్తని పలకరిస్తూ అంది నీరజ.

"నాకు ఆలోచనే రాలేదు సుమా!" అని నాలిక్కరుచుకుని, "పాపని స్కూల్లో చేర్పిస్తున్నావట," అన్నాడు ప్రబంధ్.

"మీరు ఏది పట్టించుకున్నారు గనక?"

"నీరూ! అదేవద్దంటాను, ఎప్పుడో తీరిక చేసుకుని వస్తే యిలా నిష్ఠూరాల్తో మనసు పాడు చేస్తావెందుకు?"

"ఇంతకు ముందులా వున్నారా మరి మీరు?"

"లీవిట్! ఇంతకీ ఏస్కూల్లో చేర్పుతున్నావు?"

"లిటిల్‌ఫ్లవర్"

"ఇట్సాల్‌రైట్. అడ్మిషన్‌ఫాంలో 'తండ్రిగా' నాపేరు మాత్రం రాయకు" అతను అతిసులభంగా అనగలిగిన ఆ మాటలకు అవాక్కయింది నీరజ. తేరుకుని,

"పాప తండ్రి మీరు కాదా?" సీరియస్‌గా అడిగింది. "కాదంటే నిన్నుకాదు, నన్ను నేనే అవమానించుకోవటం!"

"మరేమిటి అభ్యంతరం?"

"ప్లీజ్! అర్థం చేసుకో నీరూ! ఇప్పుడే సజయతో-ఇక్కడికి రావాలంటేనే సమస్యగా వుంది. ఒట్టి 'అనుమానపు మనిషి', పైగా, భవిష్యత్తులో కొన్ని చట్టపరమైన సమస్యలొస్తాయి!"

"దేని గురించి?"

"ప్రాపర్టీ ఎట్సెట్రా!"

"డామ్ యువర్ ప్రాపర్టీ! డాక్టర్‌గా నేను సంపాదించేది చాలు అర్పణకి."

"నువ్వు అడక్కపోవచ్చు పాప పెద్దయ్యాక అడగొచ్చుగా!"

నీరజకి అతని మాటలు కొత్తగా, వింతగా తోచాయి.

"పాపక్కావల్సింది మీ ఆస్తికాదండీ! తండ్రి....తండ్రి కావాలి!"

"నా పేరు రికార్డుల్లో కెక్కించాలని నీకెందుకంత ఆరాటం? స్కూలు రిజిష్టర్‌లో రాయనంతమాత్రాన అర్పణ నా బిడ్డ కాక పోతుందా?" నచ్చ జెప్పే ప్రయత్నం చేశాడు ప్రబంధ్.

ఆమె సహనం, సంయమనం కోల్పోయింది. 'ఇన్నేళ్ల ప్రేమ కేవలం ఒక కాగితం పువ్వులా తేలిపోతోందా? కేవలం 'ఆస్తి' అనే భౌతిక విషయ భయం పసిబిడ్డని కూడా అనుమానించే పరిస్థితికి మనిషిని మార్చిందా?' ఆవేశంగా బరస్టయింది నీరజ.

"ప్రేమ రెండు శరీరాలు కలుసుకోవటానికేనా? ఆ కలయిక ఫలితాలపై బాధ్యత వహించదా? కేవలం బిడ్డలకోసం, సుఖం కోసమే ప్రేమయితే ఈ ప్రపంచంలో నువ్వొక్కడివే మగాడివా? మన బిడ్డకు తండ్రిగా నమోదు కావటానికిష్టంలేని నీ ప్రేమపేరు ప్రేమకాదు, ప్రేమనాటకం, ప్రేమ వంచన, గెటౌట్ ఆఫ్ హియర్." ఆడపులిలా గర్జించిందామె.

అంతా చూస్తూ వింటున్న అర్పణకు పూర్తిగా అర్థం కాకపోయినా 'నాన్న' నాన్నగా పేరు రాయొద్దనటం అర్థమైంది.

"నాన్నా! నువ్వు నా నాన్నవి కావా నాన్నా?" అతని కాళ్లకు చుట్టుకుంది అర్పణ.

అతని ముఖంలో ఓ క్లిష్టమైన చిక్కుముడి చాలా సులభంగా విడిపోయిన తృప్తి తప్ప మరో భావానికి చోటు లేకపోయింది. విసురుగా పాపని విడిపించుకుని వెళ్లిపోయాడు ప్రబంధ్.

'ప్రేమ గమ్యం పెళ్లి కాదనుకుని ఎంత పొరబడ్డాను? స్త్రీ పురుష సంబంధాన్ని కామమనే మూడక్షరాలకు పరిమితం చేసి, స్త్రీ స్వేచ్ఛకు వక్రభాష్యం చెప్పి దోచుకునే కోణం ఒకటుంటుందని గ్రహించని మూర్ఖురాల్ని!' ఆత్మనిందతో రోదిస్తోంది నీరజ.

'ప్రబంధ్! ఎంత తెలివైనవాడివి! అందుకేనా పాపతో ఫోటో తీయించు కుందామన్న నా కోరికను దాటవేస్తూ వచ్చావు! అందుకేనా మనిద్దరం తీయించుకున్న ఫోటో కూడా అదృశ్యం చేశావ్! నీ ఆస్తిలో వాటాకోరే నీచాన్ని మాకంటగట్టి నీ నీచత్వాన్ని రుజువు చేసుకున్నావ్!

నీ వంటి అల్పుడి ప్రేమమైకంలోపడి జీవితాన్ని ఎంత శిథిలం చేసుకున్నాను!' పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది నీరజ.

* * *

పాప అన్వేషణ ఫలించినట్లుంది! తల్లిని కుదుపుతూ, "అమ్మా! అమ్మా" పిలిచింది అర్పణ. బిడ్డని హృదయానికి హత్తుకుంది నీరజ. తల్లిగుండె చప్పుడు అర్పణ చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

"అమ్మా! నన్ను స్కూల్లో చేర్పించు" మూసి వున్న గుప్పిటితో తల్లి చుబుకాన్ని పైకెత్తి ఆమె కళ్లలోకి చూస్తూ అంది అర్పణ.

నీరజ బిడ్డముద్దు ముఖాన్ని ప్రతిమలా చూస్తోంది!

"అమ్మా నిన్ను ఏడిపించే నాన్న నాకూవద్దు. స్కూల్లో నా నాన్న....నాన్న....చచ్చిపోయాడని లాయి!" నాలుగేళ్ల పాప నోట అలాంటి మాటలు వెలువడటం నమ్మలేని నిజం.

"తప్పమ్మా! అలా అనకూడదు!" అర్పణ మాటల్ని ఆమె మానసికంగా భరించలేక పోయింది! ప్రబంధ్‌పై ఆమె ప్రేమ అంత ప్రగాఢమైంది!

అప్పుడు....అర్పణ పిడికిలి నెమ్మదిగా తెరుచుకుంది. ఆటవస్తువుల్లోని.... అంగుళంసైజున్న చిన్న ప్లాస్టిక్ కత్తిని తల్లికి చూపిస్తూ," అమ్మా! నేను బోల్డన్ని తలగతులు చదివి చాలా పెద్దవుతాను కదా! అప్పటికి ఈ కత్తికూడా బోల్డంత పెద్దదౌతుంది కదా! అప్పుడు దీంతో నిన్నేడిపించిన నాన్నని చంపేస్తాలే!" కళ్లు మిలమిలలాడించింది అర్పణ.

ఆ మాటలతో స్థాణువైంది నీరజ.

"ఈ లేత మనసులో ఇంతకర్కశమైన ఆలోచన ఏర్పడటానికి కారణం? నో! పాప ఇలాంటి ఆలోచనల్తో పెరగటం, నాకూ, తనకీ, ఈ సమాజానికీ కూడా శ్రేయస్కరం కాదు." అనుకుంది నీరజ.

స్త్రీత్వం లోని సున్నితత్వం కోల్పోకుండా పాపని తీర్చిదిద్దటమే తన జీవిత గమ్యంగా కొత్త మార్గంలో ప్రయాణానికి ఆ క్షణమే నాంది పలికింది డాక్టర్ నీరజ!